క్లుప్తంగా

ఆర్బీకే తనిఖీ



గుడేకల్ ఆర్‌బీకేను తనిఖీ చేసిన ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి, ఏఓ మహేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరురూరల్: రైతు భరోసా కేంద్రాల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాల ని ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి సూచించారు. సోమవారం గుడేకల్ గ్రామ ఆర్బీకేను ఆయన తనిఖీ చేశారు. ఏడీఏ మాట్లాడుతూ ఆర్‌బీకేల్లో విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని, కావలసిన రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. ఖరీఫ్‌లో ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకొని ఫలితాలకనుగుణంగా విత్తనం విత్తుకోవాలన్నారు. లూజు విత్తనాలను కొనుగోలు చేసి మోసపోవద్దని సూచించారు. అనంతరం పట్టణంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన, కల్తీ లేని విత్తనాలను విక్రయించాలని ఆదేశించారు.

అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మిగనూరురూరల్: సీజనల్ వ్యాధులపై పశువుల యజమానులు అప్రమత్తంగా ఉండాలని ఆదోని డివిజన్ పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వెంకటరమణ, ఎమ్మిగనూరు పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ సుబ్రమణ్యాచారి సూచించారు. సోమవారం మండల పరిధిలోని కందనాతి గ్రామంలో వాటర్ షెడ్ పథకం కింద ఉచితంగా పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పశువులకు సోకే వ్యాధులపై ఎప్పటికప్పుడు జాగ్రత్తగా ఉండాలని, వాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే పశువైద్యుడి దృష్టికి తీసుకెళ్లి వైద్యం చేయించుకోవాలని సూచించారు. మండల పశువైద్యధికారి డాక్టర్ అశోక్‌కుమార్, గ్రామ నాయకులు రామకృష్ణారెడ్డి, రైతులు, పశువుల యజమానులు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌ను వినియోగంలోకి తేవాలి

గోనెగండ్ల: మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న పంచాయతీ వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు డిమాండ్ చేశాడు. సోమవారం మహేష్, మునిస్వామి గౌడ్ తదితరులు తహసీల్దార్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. గోనెగండ్లలో పంచాయతీ నిధులతో నిర్మించిన వాటర్ ప్లాంట్‌ను వినియోగంలోకి తెచ్చి ప్రజలకు మంచినీటిని సరఫరా చేయాలని కోరారు. అనంతరం సంతకాలసేకరణ కార్యక్రమం నిర్వహించారు.

'పీఎం శ్రీ'కి జొన్నగిరి హైస్కూల్ ఎంపిక

తుగ్గలి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం శ్రీ పథకానికి జొన్నగిరి జెడ్పీ ఉన్నత పాఠశాల ఎంపికైనట్లు ఇన్‌చార్జ్ ఎంఈఓ రామవెంకటేశ్వర్లు తెలిపారు. ఈ పథకానికి ఎంపికైన పాఠశాలలకు కేంద్ర ప్రభుత్వం నేరుగా నిధులు కేటాయించి సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు. మరుగుదొడ్లు, గ్రంథాలయం, విద్యుత్, ప్లాస్టిక్ రహిత పాఠశాల, శుద్ధజలం, ల్యాబ్‌లు, క్రీడలు, వృత్తి విద్యా కోర్సుల కోసం నిధులు మంజూరు చేస్తుందని వివరించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నాడు-నేడు కింద రెండు విడతల్లో మంజూరుచేసిన రూ.1.10 కోట్లతో పాఠశాలలో అదనపు తరగతి గదు లు, మౌలిక వసతుల కోసం ఖర్చు చేశారు.

పుస్తకాల విరాళం

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థుల అభ్యున్నతికి తన వంతు సహకారం అందిస్తానని పట్టణానికి చెందిన రిటైర్డ్ జీఎస్టీ అడిషనల్ కమిషనర్ హెచ్.శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆయన సోమవారం స్థానిక ఎస్‌ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించారు. తన జీవన ప్రస్థానంలో ఇప్పటివరకు సమకూర్చుకున్న పుస్తకాలు, గ్రంథాలను సివిల్స్, గ్రూప్స్‌కు సన్నద్ధమయ్యే విద్యార్థుల కోసం కళాశాల ప్రిన్సిపాల్ మహబూబ్‌బాషాకు అందజేశారు. పుస్తకాలను లైబ్రరీలో విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని కోరారు.

4న ఉచిత వైద్య శిబిరం

హొళగుంద: మండల పరిధిలోని ఎల్లార్తి గ్రామంలో ఈ నెల 4న ఆదోనికి చెందిన మధు హాస్పిటల్, ఎస్‌ఎస్‌వీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సర్పంచ్ కురువ చాముండేశ్వరి తెలిపారు. శిబిరంలో అన్ని రకాల వైద్య పరీక్షలు, చికిత్సతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని వెల్లడించారు.

ఫెయిలైన విద్యార్థులకు శిక్షణ

వెల్దుర్తి: ఇటీవల జరిగిన ఇంటర్మీడియెట్ పరీక్షలలో ఫెయిలైన విద్యార్థులకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రత్యేక తరగతులు సోమవారం నుంచి ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ నాగభూషణం తెలిపారు. ఈనెల 20వ తేదీ వరకు సబ్జెక్టుల వారీగా లెక్చరర్లు ప్రత్యేక క్లాసులు తీసుకుని పాఠ్యాంశాలు బోధిస్తారన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పోచిమిరెడ్డికి మాతృవియోగం



నాగలక్ష్మమ్మ (ఫైల్)

పత్తికొండ రూరల్: వైఎస్సార్‌సీపీ నాయకుడు, సేవాదళ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డి తల్లి రిటైర్డ్ టీచర్ నాగలక్ష్మమ్మ (79) సోమవారం కన్నుమూశారు. అనారోగ్యానికి గురై గత కొద్దిరోజులుగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె కోలుకోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పాఠశాలల్లో పహారా

- ప్రభుత్వ జెడ్పీ హైస్కూళ్లకు నైట్ వాచ్‌మన్‌ల నియామకం
- ప్రభుత్వ ఉత్తర్వులపై హర్షం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు, ప్రజలు
- బడులకు భద్రత కల్పించేందుకు చర్యలు



మద్దికెర జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల

మద్దికెర: ప్రతిరోజు ఉదయం పాఠశాల గేట్లు తెరవగానే ఏమీ చూడాల్సి వస్తోందోనని భయభయంగా అడుగులు వేసుకుంటూ పాఠశాలల్లో అడుగుపెడితే బ్రాందీ సీసాలు, సారా ప్యాకెట్లు, తలుపులు పగులగొట్టడాలు చూసి భయభ్రాంతులకు గురయ్యేవారు ప్రధానోపాధ్యాయులు. వీటికి చెక్ పెడుతూ రాష్ట్ర ప్రభుత్వం బడులకు భద్రత కల్పించేలా నైట్ వాచ్‌మెన్‌లను నియమించాలని తీసుకున్న నిర్ణయంతో ఇటు ఉపాధ్యాయులు, అటు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలల్లో రాత్రి సమయాల్లో పహారా ఉంటే మందుబాబులు, దొంగలు, ఆకతాయిల అల్లరి చేష్టలకు చరమగీతం పాడవచ్చని పేర్కొంటున్నారు.

గతేడాది స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో విద్యుత్ మోటారు అపహరించడమే గాకుండా తలుపులు పగులగొట్టడం, గేట్లు విరగ్గొట్టడంతో సరిచేయించుకోలేక ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి దాదాపు 10 ఫ్యాన్లు, లైట్లు ఎత్తుకుపోయారు. పెరవలి ఉన్నత పాఠశాలలో పలుమార్లు తాళాలు పగులగొట్టడం, వస్తువులు దొంగలించుకుపోయారు. పలు పాఠశాలల్లో ఇదే పరిస్థితి. పాఠశాలలకు ఎన్నో ఏళ్లుగా నైట్ వాచ్‌మన్‌లు లేకపోవడంతో ఇన్నాళ్లు రక్షణ లేకుండా పోయింది. ఇదే అదునుగా పలువురు దుండగులు వివిధ పాఠశాలల్లో చోరీలకు పాల్పడేవారు. విద్యుత్ పరికరాలు, ఇతర సామగ్రిని చోరీ చేసేవారు. ఆ సామగ్రి రికవరీ కాక, విద్యార్థులకు డిజిటల్ విద్య కూడా సక్రమంగా అందని దుస్థితి. దీనికి తోడు కొన్ని చోట్ల రాత్రివేళల్లో మందుబాబులు, జూదరుల అసాంఘిక కార్యకలాపాలకు పాఠశాలల ప్రాంగణాలు, తరగతి గదులు నిలయాలుగా ఉండేవి. మద్యం మత్తులో మందుబాబులు, ఆకతాయిలు పాఠశాలల ఆస్తుల ను ధ్వంసం చేసిన ఘటనలూ అనేకం ఉన్నాయి. పశువులు పాఠశాల ఆవరణలోకి చొరబడి పచ్చని మొక్కలను ధ్వంసం చేస్తున్నాయి. వీటన్నింటినీ ఉపాధ్యాయులు భరిస్తూ వచ్చారు. పలువురు ఉపాధ్యాయులు సెలవు రోజుల్లో సైతం పగటి పూట హైస్కూళ్లకు వచ్చి పరిస్థితిని గమనించేవారు. రాత్రి పూట రాలేరు కదా...ఈ పరిస్థితుల్లో జెడ్పీ ఉన్నత పాఠశాలల ఆస్తుల పరిరక్షణకు నైట్ వాచ్‌మన్‌లను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఇటీవల ఉత్తర్వులు కూడా జారీ చేసింది. దీనిపై ఉపాధ్యాయులు ముఖ్యంగా ప్రధానోపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

స్థానికులకు ప్రాధాన్యం

హైస్కూళ్లకు నైట్ వాచ్‌మన్‌ల నియామకంలో స్థానికులకు ప్రాధాన్యం ఇస్తారు. ముఖ్యంగా ఆయా పాఠశాలల్లో పని చేసే ఆయా భర్తకు లేదా మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల్లో మహిళ భర్తకు ప్రాధాన్యం ఇస్తారు. వారు కాకపోతే 60 ఏళ్ల వయస్సులోపు ఉన్న ఎక్స్ సర్వీస్‌మెన్ లేదా పేరెంట్స్ కమిటీ ఎంపిక చేసే వ్యక్తిని నియమించాలని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. దీని ప్రకారం హెచ్‌ఎంలు తమ హైస్కూళ్లలో నైట్ వాచ్‌మన్‌లను నియమించుకునే పనిలో నిమగ్నమయ్యారు.

నియోజకవర్గంలో జెడ్పీ ఉన్నత పాఠశాలల వివరాలు	
మండలం	జెడ్పీ ఉన్నత పాఠశాలలు
కృష్ణగిరి	8
మద్దికెర	4
పత్తికొండ	6
తుగ్గలి	7
వెల్దుర్తి	11
మొత్తం	36

ఆకతాయిల ఆటకట్టు



ప్రభుత్వ హైస్కూళ్ల ఆస్తుల పరిరక్షణకు నైట్ వాచ్‌మన్‌లను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం చాలా సంతోషంగా ఉంది. గతంలో పలు పాఠశాలల్లో పలుమార్లు గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి విలువైన వస్తువులు దొంగలించుకుపోయారు. ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకున్నా ఫలితం లేకపోయేది. పాఠశాలల సంరక్షణ, ఆస్తుల పరిరక్షణకు నైట్ వాచ్‌మన్ ఆవశ్యకతను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ఎట్టకేలకు మే 1 నుంచి వాచ్‌మన్‌ను నియమించాలని రాష్ట్రప్రభుత్వం ఆదేశించడం హర్షణీయం. ఆ మేరకు నియామకం పూర్తి చేశాం.

– రంగస్వామి, ఎంఈఓ

బడులకు భద్రత అవసరం



ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తోంది. వాటిని సంరక్షించుకోవడం మన బాధ్యత. సాయంత్రం పాఠశాల వదలగానే గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. పాఠశాలలకు నైట్ వాచ్‌మెన్‌లను నియమిస్తూ ప్రభుత్వం తీసుకున్న హర్షించదగ్గ విషయం.

– రామాంజులు, పీఎంసీ చైర్మన్, మద్దికెర జెడ్పీ హైస్కూల్

భగవద్గీతపై ప్రచారం

వెల్దుర్తి: బొమ్మిరెడ్డిపల్లె గ్రామంలో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం జరిగింది. సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక డోన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ప్రచారంలో భాగంగా సాంద్ర సింధు వేదం సారాంశ ప్రదాత ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల ఆధ్యాత్మిక రచనల ప్రతులను పంపిణీ చేశారు. కమిటీ అధ్యక్షుడు నాగార్జున, ప్రతినిధులు భగవద్గీతలోని త్రైత సిద్ధాంతం, సాంద్ర సింధు వేదం గురించి ప్రజలకు వివరిస్తూ సాగారు.

మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి



బాధ్యతలు స్వీకరిస్తున్న గుమ్మనూరు నారాయణ

ఆలూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం తన వంతుగా కృషి చేస్తానని గుమ్మనూరు నారాయణ పేర్కొన్నారు. ఆయన సోమవారం స్థానిక ఎల్లార్తి రోడ్డు సమీపంలోని మార్కెట్ యార్డు కార్యాలయంలో కార్యదర్శి శాంతకుమార్ ఆధ్వర్యంలో చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పాలకవర్గం సభ్యులతో యార్డు అభివృద్ధి పనులు, పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలపై చర్చించారు. యార్డులో పంట దిగుబడులను నిల్వ ఉంచేందుకు అవసరమైన గోదాములు ఏర్పాటు చేస్తామన్నారు. యార్డు వైస్ చైర్మెన్ చిన్న ఈరన్న, పాలకవర్గం సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం యార్డు చైర్మెన్, కమిటీ సభ్యులు మంత్రి మంత్రి గుమ్మనూరు జయరాంను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

గోపుర కలశ ప్రతిష్ఠోత్సవాలు

ఎమ్మిగనూరు: పట్టణంలోని అన్నమయ్య సర్కిల్‌లో వెలసిన శ్రీ వేంకటసాయి దేవాలయంలో నూతనంగా నిర్మించిన సింహద్వార, గోపుర కలశ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు సోమవారం వైభవంగా ప్రారంభయ్యాయి. మూడు రోజుల పాటు ఆలయంలో హోమంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

సేవే జీవిత పరమార్థం



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న లోకాయుక్త చైర్మన్ జస్టిస్ లక్ష్మణరెడ్డి, శ్రీమఠం పీఠాధిపతి సుభుదేంద్రతీర్థులు

ఎమ్మిగనూరు టౌన్: సామాజిక సేవా కార్యక్రమాలతో పేదలను ఆదుకున్నప్పుడే జన్మ సార్థకమవుతుందని ఏపీ లోకాయుక్త చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి, మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి సుభుదేంద్ర తీర్థులు అన్నారు. వెంకమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక విశాల గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు పేద మహిళలు, వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల సంక్షేమం కొరకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపడితే దేవుడికి సేవ చేసినట్లు అవుతుందన్నారు. శ్రీమఠం పీఠాధిపతి సుభుదేంద్ర తీర్థులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తాము సంపాదించిన దాంట్లో కొంత పేదల కోసం ఖర్చు చేయాలన్నారు. యశోద ఆస్పత్రి అధినేత దేవేంద్రరావు, తెలంగాణ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, వ్యాపారవేత్త ఏపీఎం రావు, గ్రేటర్ రాయలసీమ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ కార్యదర్శి బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

జవాన్‌కు కన్నీటి వీడ్కోలు





జవాన్ మృతదేహానికి గౌరవ వందనం చేస్తున్న అధికారులు (ఇన్‌సెట్) తలారి జోగన్న (ఫైల్)

మద్దికెర: మండల పరిధిలోని హంప గ్రామానికి చెందిన తలారి జోగన్న (37) అనే జవాను అనారోగ్యంతో మృతి చెందడంతో సోమవారం ఆర్మీ అధికారులు సైనిక వందనం చేస్తూ గ్రామప్రజలు, బంధువుల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. హంప గ్రామానికి చెందిన జోగన్న 28 అస్సాం రైఫిల్స్ విభాగంలో నాగాలాండ్‌లోని తుఎన్‌సాంగ్ జిల్లాలో విధులు నిర్వహిస్తున్నారు. పది రోజులు క్రితం ఆరోగ్యం బాగాలేదని స్వగ్రామానికి వచ్చారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. జవానుకు భార్య రాజేశ్వరి, ఇద్దరు కుమారులు ఉన్నారు. సోమవారం జవాను అంత్యక్రియలు నిర్వహించగా సైనికులతో పాటు స్థానిక పోలీస్ అధికారులు పాల్గొన్నారు. జవాను మృతికి మాజీ సర్పంచ్ లోకిరెడ్డి, ఉపసర్పంచ్ తిమ్మప్ప ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



విద్యార్థిని జ్యోష్ణను అభినందిస్తున్న ఎమ్మెల్యే శ్రీదేవి

పత్తికొండ రూరల్: విద్యార్థులు బాగా చదువుకుని ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సూచించారు. స్థానిక శ్రీసాయిప్రతిభ కళాశాల విద్యార్థిని జ్యోష్ణ ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీలో 434/440 మార్కులు సాధించడంతో సోమవారం ఆ కళాశాలలో విద్యార్థినిని అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతిభ గల విద్యార్థులకు తమ వంతు ప్రోత్సాహం అందిస్తామన్నారు. నాయకులు ఎస్.రామచంద్రారెడ్డి, విద్యావేత్త అరుణాచలం రెడ్డి, కళాశాల సిబ్బంది ఉన్నారు.

క్వారీలో మిషన్ల చోరీకి యత్నం

కృష్ణగిరి: పట్టపగలు గ్యాస్ కట్టర్లతో మిషన్లను కట్ చేసి సామగ్రి చోరీ చేసేందుకు ప్రయత్నించాడో వ్యక్తి. కృష్ణగిరి మండలం చుంచుఎర్రగుడి పరిధిలోని రాగుల పాడు సమీపాన సూర్య మినరల్స్ క్వార్ట్జ్ క్వారీ 9 నెలలుగా మూతపడింది. రాయిని ముక్కలు చేసే మిషన్‌తోపాటు, కాటా వేసే మిషన్, ఇతర సామగ్రి ఇక్కడే ఉన్నాయి. డోన్‌కు చెందిన గుజిరీ వ్యాపారి షబ్బీర్ ఈ సామగ్రిని దొంగలించి అమ్ముకునేందుకు పక్కా ప్రణాళిక వేశాడు. గ్యాస్ కట్టర్లను మాట్లాడుకుని వేయింగ్ మిషన్‌తోపాటు సామగ్రిని ముక్కలుగా చేయించాడు. వీటిని తరలించేందుకు ఆదివారం డోన్‌కు చెందిన కమ్మరి కన్నప్పఆచారికి చెందిన ఐచర్ వాహనాన్ని (ఏపీ 02 టీసీ 0357) బాడుగను మాట్లాడుకుని క్వారీ వద్దకు వెళ్లారు. సామగ్రిని వాహనంలోకి ఎక్కిస్తుండగా క్వారీకి వాచ్‌మెన్‌గా ఉన్న చుంచుఎర్రగుడికి చెందిన రవికుమార్ రావడంతో దుండగులు వాహనాన్ని వదిలి పరారయ్యారు. ఘటనపై స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో ఐచర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. క్వారీ యజమాని బెంగళూరుకు చెందిన ఖాన్ అజ్‌ఫర్ మహమ్మద్ ఖాన్ రూ.10 లక్షల విలువ చేసే మిషన్లు డ్యామేజ్ అయినట్లు సోమవారం ఫిర్యాదు చేయడంతో డోన్‌కు చెందిన షబ్బీర్, కమ్మరి కన్నప్పఆచారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

భారీ వర్షం

మద్దికెర: మండలంలో ఆదివారం రాత్రి 48.6 మీ.మీ వర్షం కురిసింది. ఈదురు గాలులకు ఎం.అగ్రహారంలో రైతులు హనుమంతు, కిష్టన్నకు చెందిన మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. 8 ఎకరాలలో పంటలు నేలకొరగడంతో రూ.2 లక్షలు నష్టం వాటిల్లిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాంనగర్ కాలనీలో ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. అలాగే కృష్ణగిరి మండలంలో 68.2 మి.మీ వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ప్రభోత్సవం



ఎల్.నగరంలో వీరబ్రహ్మేంద్ర స్వామి ప్రభోత్సవం

వెల్దుర్తి: మండల పరిధిలోని ఎల్.నగరం గ్రామంలో వీరబ్రహ్మేంద్ర స్వామి 42వ తిరునాలలో భాగంగా ప్రభోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం వెంకటస్వామి తాత ఆరాధన అనంతరం పూజారి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో సోమవారం ఆలయం నుంచి నందికోల సేవతో ప్రారంభమైన ప్రభోత్సవం చెన్నకేశవస్వామి ఆలయం వరకు సాగింది. ఆనవాయితీగా గ్రామపెద్దలైన జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సమీర్‌కుమార్ రెడ్డి, కుటుంబ సభ్యులు స్వామి వారికి తొలి నైవేద్యం అందించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు ప్రభోత్సవంలో పాల్గొన్నారు. రాత్రి నిర్వహించిన పంచమాంకములు నాటకం అలరించింది.

నేడు బండలాగుడు, పరుగుపందెం పోటీలు

ఉత్సవాలలో భాగంగా ఈనెల 2వ తేదీ మంగళవారం పాలపండ్ల వృషభాలకు బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేల నగదు బహుమతులు అందించనున్నామన్నారు. పరుగు పందెం నిర్వహించి మొదటి మూడు స్థానాల విజేతలకు వరుసగా రూ.3 వేలు, రూ.2వేలు, రూ.వెయ్యి అందిస్తామన్నారు.

ఠంచన్‌గా పింఛన్



రాతనలో కురుగోడు సంగీతకు పింఛన్ ఇచ్చేందుకు ఫేస్ అంథెంటికేషన్ చేస్తున్న పీఎస్ శివ



ఎమ్మిగనూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రహమత్‌బీకి పింఛన్ అందిస్తున్న వలంటీర్ షాహిన్

ఆలూరు రూరల్: ప్రతి నెలా నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం అందించే పింఛన్లను ఎప్పటిలాగే ఠంచన్‌గా చేపట్టారు. ఆదివారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత వెబ్‌సైట్ అందుబాటులో రావడంతో నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని గ్రామాల్లో వలంటీర్లు పింఛన్ల పంపిణీ ప్రారంభించి ఉదయం 6 గంటల్లోపు 80 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు ఆయా మండలాల ఎంపీడీఓలు వెల్లడించారు. ఇతర కారణాలతో అందుబాటులో లేని లబ్ధిదారులకు నేడు పింఛన్ నగదు పంపిణీ చేయనున్నారు. ఇంటి వద్దకే పింఛన్ నగదు అందించే వెసులుబాటు కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి వృద్ధులు, వికలాంగులు కృతజ్ఞతలు తెలిపారు.

నందవరం: నందవరం గ్రామానికి చెందిన రహమత్ బీకి మూడు రోజుల క్రితం ఎమ్మిగనూరు రేఖ ఆసుపత్రిలో గర్భసంచి ఆపరేషన్ జరిగింది. విషయం తెలుసుకున్న వలంటీర్ షాహిన్ ఆసుపత్రికి వెళ్లి పింఛన్ సొమ్ము అందజేయడంతో లబ్ధిదారురాలు వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలిపింది. మండలంలో మొత్తం 6,978 మంది పింఛన్‌దారులకు రూ.1.91 కోట్లు మంజూరుకాగా తొలిరోజు 5,024 మందికి రూ.1.37 కోట్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. మిగతా వారికి ఈ నెల 5వ తేదీలోపు పింఛన్లు పంపిణీ చేసి వంద శాతం పూర్తిచేస్తామన్నారు.

గోనెగండ్ల: మండలంలో మొదటి రోజు 60 శాతం పింఛన్ల పంపిణీ జరిగిందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్ తెలిపారు. రెండు రోజుల్లో వంద శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేస్తామని వెల్లడించారు.

తుగ్గలి: మండలంలో సోమవారం తెల్లవారుతుండగానే వలంటీర్లు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ కానుక అందజేశారు. మండలంలో 7,591 మంది పింఛన్‌దారులకు రూ.2,10,08,500 మంజూరైంది. తొలి రోజు సాయంత్రం 75.56 శాతం మందికి పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు.

వైఎస్సార్‌సీపీకే ప్రజా మద్దతు

నందవరం: వైఎస్సార్‌సీపీకి ప్రజల మద్దతు మెండుగా ఉందని ఆ పార్టీ మండల కన్వీనర్ శివారెడ్డి గౌడ పేర్కొన్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం పూర్తయిన సందర్భంగా సోమవారం స్థానిక సచివాలయం–1 ఆవరణలో నాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలో 3,590 కుటుంబాలకుగానూ 3,490 కుటుంబాల నుంచి స్పందన లభించిందని, ప్రజలు జగనన్న పాలనపై పూర్తి విశ్వాసంతో ఉన్నారన్నారు. అనంతరం సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లను శాలువాలతో సన్మానించారు. ముగతి సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, నది కైరవాడి ఉప సర్పంచ్ చాంద్‌బాషా, నాయకులు రమేషప్పగౌడ్, యల్లా గౌడ్ ముత్తన్న, సరళ విజయన్న పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



మృతి చెందిన ప్రశాంతి

ఆలూరు రూరల్: హాలహర్వికి చెందిన ప్రశాంతి (21) అనే వివాహిత సోమవారం ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలు.. హాలహర్వికి చెందిన శకుంతల, మల్లికార్జున దంపతుల కుమార్తె ప్రశాంతి కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతోంది. సోమవారం మధ్యాహ్నం గ్రామ సమీపంలో పురుగు మందు తాగడంతో బంధువులు స్థానిక పీహెచ్‌సీలో చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు వెల్లడించారు. ప్రశాంతికి ఏడాదిన్నర క్రితం కౌతాళం మండలం బదినేహాల్‌కు చెందిన సోమేష్‌తో వివాహమైంది. వీరు ఆరు నెలల క్రితం విడాకులు తీసకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హాలహర్వి ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

ఆలూరు: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులచే ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయించాలని హౌసింగ్ డీఈ ఆదినారాయణ సంబంధిత ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. సోమవారం ఆలూరు మండలం మూసానపల్లి జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. డీఈ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో మొత్తం 5,317 గృహాలకుగాను 90 రూఫ్ లెవెల్‌లో ఉండగా, 1,473 గృహాల నిర్మాణం పూర్తయినట్లు తెలిపారు. 1,126 బీబీఎల్, 372 ఆర్‌ఎల్ దశలో ఉన్న వాటిని వేగవంతం చేసేలా స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో పని చేయాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



రాతిదూలాన్ని లాగుతున్న వృషభాలు

కృష్ణగిరి: అమకతాడు గ్రామంలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి పాలపండ్ల వృషభాల బండలాగుడు పోటీల్లో కర్నూలు జిల్లా, గూడూరు మండలం, మునగాల గ్రామానికి చెందిన మహదేవమ్మ, అంజినమ్మల వృషభాలు విజేతగా నిలిచాయి. అలాగే కృష్ణాపురం శివరాముడు, పెద్దనేలటూరు సీతారాముడు వృషభాలు ఉమ్మడిగా రెండో స్థానం, ప్యాపిలి మండలం, డీ.రంగాపురానికి చెందిన రామచంద్రారెడ్డి వృషభాలు మూడో స్థానం, ప్యాపిలి మండలం గుడిపాడు రాగుల వెంకటరామిరెడ్డి వృషభాలు నాలుగో స్థానం. పీఆర్ పల్లె హోటల్ బలరాముడు, మంగలాంపల్లె మురళిమోహన్ వృషభాలు ఉమ్మడిగా ఐదవ స్థానంలో నిలిచాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పోటీల్లో 16 జతల వృషభాలు పాల్గొనట్లు చెప్పారు. గెలుపొందిన వృషభాల యజమానులకు దాతల సహకారంతో వరుసగా రూ. 30 వేలు, రూ. 20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3 వేల నగదు బహుమతులు అందజేశారు. అలాగే యువకుల పరుగు పందెం పోటీల్లో వెల్దుర్తి మండలం సిద్ధనగట్టు నవీన్, సంధ్యాల కిషోర్, డోన్ మండలం వెంకటనాయునిపల్లె కాంత్ గెలుపొందారు. వారికి మంగలి చిన్న రామాంజినేయులు, బాలు వెండి పథకాలను అందజేశారు.

జనం లేకున్నా.. వాహనాలకు అడ్డంగా !



ట్రాఫిక్‌లో నిలిచిన అంబులెన్స్

గోనెగండ్ల: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర సోమవారం సాయంత్రం గోనెగండ్లకు చేరింది. పాదయాత్ర ఎమ్మిగనూరు, కర్నూలు ప్రధాన రహదారిపై కొనసాగింది. జనం లేకపోయినా రోడ్డుపై వచ్చిన వాహనాలకు దారి ఇవ్వకపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో వాహనాల్లో ప్రయాణించే వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. జనం లేకపోయినా రోడ్డుపై దారి ఇవ్వకుండా అడ్డంగా వెళ్లడం ఏమిటని మండిపడ్డారు. ఎమ్మిగనూరు నుంచి కర్నూలుకు వెళుతున్న అంబులెన్స్‌కు కూడా దారి ఇవ్వకపోవడంతో సుమారు అరగంట సేపు ఆగాల్సి వచ్చింది. ఆలస్యం అవుతుందని అంబులెన్స్‌ను వెనక్కు తిప్పుకొని వేరే మార్గంలో వెళ్లిపోయారు.


నారా లోకేష్ క్షమాపణ చెప్పాలి

వాస్తవాలు తెలుసుకోకుండా ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేసిన నారా లోకేష్ క్షమాపణ చెప్పాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దొరబాబు, నాయకులు ఎస్‌బీ మన్సూర్, భాస్కర్ రెడ్డి డిమాండ్ చేశారు. గోనెగండ్లకు చేరుకున్న యువగళం పాదయాత్రలో 'లోకేష్ గోబ్యాక్' అంటూ నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ.. చంద్రబాబు, లోకేష్ చెప్పే మాయమాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. గత ఎన్నికల్లో 600 హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ సక్రమంగా నేరవేర్చక పోగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, నాయకులపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గోవింద్, మహేష్ రెడ్డి, రాముడు, గిరిశ్వరరెడ్డి, పెద్దిరెడ్డి ఉన్నారు.

శ్రామిక శక్తికి సలాం



ఎమ్మిగనూరులో ఐఎఫ్‌టీయూ జెండా ఆవిష్కరిస్తున్న సంఘ నాయకుడు ప్రసాద్



పత్తికొండ మేడే కార్యక్రమంలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మెజిస్ట్రేట్ దివ్య

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో సోమవారం మేడే ఉత్సవాలను కార్మిక సంఘాలు ఘనంగా నిర్వహించాయి. ఆయా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టాయి. స్థానిక శ్రీనివాస సర్కిల్‌లో సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, సత్యన్న, ఏఐటీయూసీ తాలుకా కార్యదర్శి బాలరాజులు, సీఐటీయూ నాయకులు రాముడు, గోవిందు ఆ పార్టీల జెండాలు వేర్వేరుగా ఆవిష్కరించి ర్యాలీలు చేశారు. సోమప్ప సర్కిల్‌లో ఐఎఫ్‌టీయూ, సీపీఐ న్యూడెమోక్రసీ నాయకులు రాజు, ప్రసాద్‌లు ఆయా సంఘాల జెండాలను ఆవిష్కరించి ర్యాలీ చేసి కార్మిక హక్కులు తదితర అంశాలపై మాట్లాడారు.

వెల్దుర్తి: మేడే పురస్కరించుకుని సోమవారం సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలు, కట్టిన జెండాలతో పట్టణం ఎరుపెక్కింది. సీఐటీయూ ఆధ్వర్యంలో మోటార్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జే నాగేశ్వరరావు జెండావిష్కరణ చేశారు. వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి పాల్గొన్నారు.

పత్తికొండ రూరల్: స్థానిక నాలుగు స్తంభాల కూడలిలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే కార్యక్రమానికి జూనియర్ సివిల్ జడ్జి మెజిస్ట్రేట్ దివ్య హాజరై కార్మిక చట్టాలను గురించి వివరించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రధాన రోడ్డు గుండా బైక్ ర్యాలీ చేశారు.